తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం

శ్రీలత, జడ్పీటీసీ, కొత్తూరు (ఫైల్)

కొత్తూరు, ఫిబ్రవరి 9: పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవమని కొత్తూరు జడ్పీటీసీ శ్రీలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ వ్యక్తి దేశానికి ప్రధాన మంత్రి కావడమే కాకుండా దేశంలో అత్యున్నత పురస్కారానికి అర్హుడని కొనియడారు. ప్రధాన మంత్రిగా పీవీ దేశాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. అలాంటి మహోన్నత వ్యక్తికి కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు గౌరవం ఇవ్వకపోవడం బాధ కలిగించే విషయమన్నారు.

శిఖం భూమిలో ప్రిహాస్ట్ తొలగింపు

నందిగామ , ఫిబ్రవరి 9 : మండలంలోని మామిడిపల్లి శివారులోని శిఖం భూమిలో ఏర్పాటు చేసిన ప్రిహాస్ట్‌ను మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం తొలగించారు. శిఖం భూములు, ప్రభుత్వ భూములు ఎవరూ కబ్జా చేసినా ఉపేక్షించేది లేదన్నారు.

సర్వీస్‌రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 9 : షాద్‌నగర్ బైపాస్‌రోడ్డుకు సంబంధించిన సర్వీస్ రోడ్డును ఆక్రమించి పార్కింగ్‌గా ఉపయోగిస్తున్న హోటళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సోలీపూర్ గ్రామానికి చెందిన సింగపాగ జంగయ్య శుక్రవారం తెలిపారు. హోటళ్లకు వచ్చే సర్వీస్‌రోడ్లను పూర్తిగా ఆక్రమించుకుని తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో సర్వీస్‌రోడ్ల మీదుగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్ : ఉప్పరిగూడ పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ప్రత్యేకాధికారి ఏఈ ఇంద్రసేనారెడ్డి

యాచారం : పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది తదితరులు

పారిశుధ్యం అందరి బాధ్యత

- ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్
- గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 9 : పారిశుధ్యం అందరి బాధ్యత అని ఎంపీపీ కృపేశ్ అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తుర్కగూడ, కప్పాడు ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను శుభ్రం చేయించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలకు మండల పరిషత్ నిధుల నుంచి అందజేసిన డిజిటల్ సామగ్రి, ఆట వస్తువుల పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉప్పరిగూడలో ప్రత్యేక అధికారి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలోని పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, ప్రత్యేక అధికారి వరప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాచారం : పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా యాచారంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. హరితహారం మొక్కలకు పాదులు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, ఈజీఎస్ అధికారులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట ప్రత్యేకాధికారి, ఏవో కవిత అన్నారు. శుక్రవారం మూడోరోజు మండలంలోని కుత్బుల్లాపూర్, తారామతిపేట, గౌరెల్లిలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, స్థానికులు అంతా కలిసి ప్రతి వీధినీ శుభ్రం చేసుకోవాలని, అప్పుడే వ్యాధులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో శ్రమదానం నిర్వహించారు. శుక్రవారం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఎంపీవో, గ్రామ ప్రత్యేక అధికారి విఠలేశ్వర్‌జీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త సేకరణ, ఉపాధి హామీ పనులు, పారిశుధ్య నిర్వహణ, స్వయం ఉపాధి, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గ్రామ పరిసరాల్లో శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజ్, సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : తారామతిపేటలో రోడ్డును శుభ్రం చేయిస్తున్న ఏవో కవిత, ఎంపీటీసీ వెంకటేశ్‌యాదవ్ తదితరులు

చేవెళ్ల రూరల్ : మల్లారెడ్డిగూడలో శ్రమదానం నిర్వహిస్తున్న ఎంపీవో, ప్రత్యేకాధికారి విఠలేశ్వర్‌జీ, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు

పోచారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఆర్టీసీ డీఎంతో కలిసి పోచారం గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 9 : పోచారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీపీ కృపేశ్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్పతో కలిసి పోచారంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ వరకు ఉన్న బస్సు సౌకర్యాన్ని పోచారం మీదుగా నడిపించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. స్పందించిన డీఎం త్వరలో బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న సంఘం సభ్యులు

షాబాద్, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పీఆర్‌టీయూ భవన్ వద్ద సంఘం మండల అధ్యక్షుడు సుదర్శన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు యాదయ్య, రాష్ట్ర బాధ్యులు నర్సింహులు, డేవిడ్‌రెడ్డి, అంజయ్య, జిల్లా బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గోవింద్, మండల బాధ్యులు హన్మంతు, ఖాజాపాషా, అంజయ్య, సింహాద్రినాయుడు, నరేశ్, రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్థానిక నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం గావ్ ఛలో కార్యక్రమం ద్వారా గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డిగూడ బూత్ లెవల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బూత్‌లెవల్ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీజేవైఎం నాయకులు మహేశ్వర్ రెడ్డి, జయసింహారెడ్డి, అక్షయ్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలో స్వామివారి పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 9: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో కలిసి ఇబ్రహీంపట్నం ఎంపీవో లక్పతినాయక్‌కు సమ్మె నోటీసును అందజేశారు. కనీస వేతనం ఇవ్వకుండా పంచాయతీ కార్మికులను ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు నరేశ్, మల్లేశ్, యాదయ్య, ఐలయ్య, రాజశేఖర్, మల్లేశ్, బాలరాజు, కిషన్ పాల్గొన్నారు.

ఆమనగల్లు : కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి లక్షలాది కుటుంబాలకు వివరించాలని ఉద్దేశంతో ఈ నెల 16న కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గొర్రెల కాపరుల సంఘం జిల్లా నాయకుడు పెంటయ్య, నాయకులు జంగయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంరూరల్: ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు

గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ గురునాయకుడు, ఎస్సై మారయ్య తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9 : గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో యాంటీడ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గురునాయుడు, ఇబ్రహీంపట్నం ఎస్సై మారయ్యలు మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవితను నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని..ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం కళాశాల వైస్‌చైర్మన్ కోహ్లీ మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

రథాన్ని లాగుతున్న భక్తులు

చేవెళ్ల టౌన్, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం చేవెళ్ల నుంచి రథాన్ని స్థానిక వేంకటేశ్వరాలయం వరకు భక్తులు లాగారు. అనంతరం గ్రామంలోని రచ్చబండ వద్దకు ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్యాస్ పథకంపై ఇంటింటి పరిశీలన

మియాపూర్, ఫిబ్రవరి 9: ప్రజాపాలన దరఖాస్తులపై చందానగర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం విచారణ ప్రారంభమైంది. సర్కిల్ పరిధిలో సుమారు 5 వేల వరకు రూ.500 గ్యాస్ పథకం కోసం దరఖాస్తులు అందాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సిబ్బంది విచారణ చేపడుతున్నారు. దరఖాస్తుదారుల ఇంటి వద్దకే వెళ్లి గ్యాస్ ఐడీ నంబర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానించిన ఫోన్ నంబర్ వంటి వివరాలను పరిశీలిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని నాలుగు వార్డులలో క్షేత్రస్థాయి విచారణను చేపడుతున్నట్లు, వివరాలను పక్కాగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు చందానగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత అధికారులదే..

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం

రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్డీవో, మండల కార్యాలయాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి భూ కబ్జాలకు గురికాకుండా చూడాలన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, హెచ్ఎండీఏకు, ఇతర అవసరాలకు కేటాయించిన ప్రభుత్వ భూముల రికార్డులను సమర్పించాలని సూచించారు. జిల్లాలోని చెరువులు కబ్జాలకు గురికాకుండా ఎఫ్‌టీఐలను గుర్తించాలన్నారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు జరుగకుండా గట్టి నివారణ చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను నమోదు చేసేందుకు ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తుందన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కొండాపూర్, ఫిబ్రవరి 9 : గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని చందానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4.1 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగండ్ల చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆటోలో వెళ్తున్న ఇద్దరు ప్రయాణికులు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి.. బ్యాగులతో పారిపోసాగారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారణలో వారి పేర్లు బాదల్ రౌత్ (24), ముమ్మడి విష్ణువర్ధన్‌రెడ్డి (19) చెప్పారు. నిందితులిద్దర్ని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. వీరికి విశ్వ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేశాడని, అతడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులిద్దర్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

గంజాయి చెట్టు పెంచుతున్న వ్యక్తి అరెస్ట్.. చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని గోపీనగర్ నివాసి ఆనంద్(42) ఇంట్లో గంజాయి చెట్టు పెంచుతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అక్కడికి వెళ్లి.. చెట్టుతో పాటు అతడిని అదుపులోకి తీసుకున్నారు. సుమారు అరకిలో బరువున్న గంజాయి సీజ్ చేసి, ఆనంద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు చందానగర్ పోలీసులు తెలిపారు. ఈ రెండు వేర్వేరు కేసుల్లో రూ.2.25 లక్షల విలువజేసే గంజాయి సీజ్ చేసినట్లు తెలిపారు.

కరెంట్ సరిగ్గా రావడం లేదు

- మంచాల సబ్‌స్టేషన్‌లో రైతు ఆందోళన
- పురుగుల మందును వెంట తెచ్చుకున్న కర్షకుడు

మంచాల, ఫిబ్రవరి 9 : పొలానికి విద్యుత్తు సక్రమంగా సరఫరా కావడం లేదంటూ మంచాల సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం సాయంత్రం ఓ రైతు ఆందోళనకు దిగాడు. ఆత్మహత్య చేసుకునేందుకు తన వెంట పురుగుల మందు తెచ్చుకున్నాడు. మండలంలోని తిప్పాయిగూడ గ్రామానికి చెందిన సత్తయ్య వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నాడు. అయితే కొన్ని రోజులుగా వ్యవసాయ బోరుబావికి విద్యుత్తు సక్రమంగా సరఫరా కావడంలేదని.. అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. నా బోరుబావికి విద్యుత్తు కనెక్షన్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచే ఇటీవల అధికారులు మరో రైతు బోరుబావికి కనెక్షన్ ఇవ్వడంతోనే ఈ సమస్య తలెత్తిందన్నారు. ఈ విషయమై ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ 25 కేబీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఐదుగురు రైతుల బోరుబావులకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వొచ్చని.. రైతు సత్తయ్య వ్యవసాయ బావికి విద్యుత్తు సమస్య ఎక్కడ తలెత్తిందో గుర్తించి పరిష్కరిస్తామన్నారు.

సింగిల్‌విండో సభ్యురాలి కుటుంబానికి డైరెక్టర్ల పరామర్శ

ఆమనగల్లు, ఫిబ్రవరి 9: ఆమనగల్లు సింగిల్ విండో డైరెక్టర్ తిప్పిరెడ్డి అరుణమ్మ కుటుంబాన్ని శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్, ఆమన గల్లు సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ ఆధ్వర్యం లో పాలకవర్గ సభ్యులు పరామర్శించారు. డైరెక్టర్ తిప్పిరెడ్డి అరుణమ్మ భర్త తిప్పిరెడ్డి అంతిరెడ్డికి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వైద్యం అనంతరం శుక్రవారం ఆయన ఇం టికి రావడంతో పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్మన్ ఆయనను పరామర్శించారు. పరామ ర్శించిన వారిలో మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీని వాస్ రెడ్డి, సీఈవో దేవేందర్, సింగిల్‌విండో డైరెక్టర్లు జోగు వీరయ్య, దోల్యానాయక్, రమేశ్, సిబ్బంది అల్లాజీ పాల్గొన్నారు.

ఆమనగల్లు సీఐ స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ

సీఐ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు, ఫిబ్రవరి 9: ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతేడాది జూలైలో చేవెళ్ల నుంచి ఆమనగల్లుకు బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లు ఏడు నెలలకే ఆమనగల్లు నుంచి బదిలీ కావడం విశేషం. ఆయన స్థానంలో కొత్త సీఐ రావాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కడ్తాల్, ఫిబ్రవరి 9: కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన జక్కుల బాలమ్మ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ట్రస్టు తరపున రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు దారమోని గణేశ్, మాజీ సర్పంచ్ పరశురాములు, నాయకులు సాయిబాబు, రాజేశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేయివి, ఎలిజియం బ్యాండ్ మ్యూజిక్

గ్రాండ్ గాల కార్నివాల్‌లో ఉత్సాహంగా గడిపిన యువత

ఉత్సాహంగా గ్రాండ్ గాలా కార్నవాల్

మాదాపూర్, ఫిబ్రవరి 9: మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం రాత్రి గ్రాండ్ గాలా కార్నివాల్ అట్టహాసంగా జరిగింది. ఇందులో యువత కుటుంబ సమేతంగా విచ్చేసి సందడి చేస్తూ ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు. ఇందులో కేయివి, ఎలిజియం బ్యాండ్ మ్యూజిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాన్‌స్టాప్ పాటలతో చిన్న, పెద్ద అనే తేడాలు లేకుండా డ్యాన్సులు వేశారు. వింటేజ్ సాంగ్స్‌తో మొదలుపెట్టి రొమాంటిక్ సాంగ్స్‌తో కలిపి పాప్ సాంగ్స్‌తో ఉర్రూతలూగించారు. ఇందులో భాగంగా జ్యూవెలరీ స్టాల్స్, పిల్లలు ఆహ్లాదకరంగా గడపడానికి కెడ్స్ ప్లే ఏరియా, కిడ్స్ వర్క్ షాపును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సెలబ్రిటీలు, ప్రముఖులు హాజరవడంతో ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో లైవ్ బ్యాండ్, డీజేతో పాటు అనేక ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడంతో త్వరలోనే మరో గ్రాండ్ గాల కార్నివాల్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో - గాంధీ బుణాకర్ మేళాలో భాగంగా పలువురు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా ఒడిస్సీ నృత్యాలు, పాటలు, జానపద కళలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి జేజేఎల్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, మాజీ డీజీపీ టీపీ దాస్, తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు. -కొండాపూర్, ఫిబ్రవరి 9